
# ఋణ్యప్రహరణము



ఉదయం ఏడింటికల్లా శివాలయం దగ్గర విరహగీతాలూ అ-ఋణగీతాలూ పాడుతూ కూచుంటానని, అతన్ని అప్పడిగిన స్నేహితుడు క్రితంరాత్రి బెదిరించాడు. దానికితోడు గుర్నాధం అతనితో మాట్లాడుతూ ఉండగా, ఒక మొహమాటస్థుడికి పాతిక రూపాయలు సర్దాల్సివచ్చేవరకూ ఆ స్నేహితుడే ఇతనికి అమాంతం ఆ పాతికా ఇచ్చాడు. పెద్దమనిషిని పంపేశాక, గుర్నాధం తీరుబాటుగా ఆశ్చర్యపడి లేచి, బ్రదర్ నీ దగ్గర డబ్బుండగా నన్నెందుకు అప్పడుగుతున్నావూ అని అడిగాడు. స్నేహితుడు ఋణతరుణహాసం చేసి, ఆ దీన్దేవుందిలే, నీకోసం రెండు సాయంకాలాలు ఇక్కడ పడిగాపులు పడివుండగా ఉబుసుపోక దారేపోయే వాళ్లని పలకరిస్తూ ఉంటే దానంతటదే జమ పడిందిలే అన్నాడు. ఏ విద్య అయినా- ముఖ్యంగా ఋణగ్రహణ విద్య, సాధనచేస్తూ ఉంటేనేతప్ప పనిచెయ్యదని ఉపదేశించాడు. అయినా మన సామ్మేంపోయె. తెలిసినవాడు మన వాతపడితే ఓమాటు కులాసా? అని చూసేది. ఔనంటే అయిదో పదో అర్థో పావలో అడిగి జేబులో వేసుకునేది. కాదంటే అదేపాయె. ఇంకోసారి దొరుకుతాడు. కాకపోయినా అప్పేగదా. మళ్లీ ఎప్పుడో అప్పుడు వాడి డబ్బు వాడి మొహాన యెలాగా విస్సిరి కొట్టేదేనాయె. ఇంతకీ తీరిక వేళలో అలా రెండూ మూడూ అయిదూ పదీ వడేసి పుచ్చుకోమట్టేగదా ఈ క్షణాన గుర్నాధం పరువు శివాలయం దగ్గర నిలబడింది. ఆపాటి గుర్నాధం దగ్గర లేకనా, ఒక్కడుగు ఇంటికెళ్తే కొల్లలు ఇనప్పెట్లో. అయితేనేం ఆ ఒక్కడుగూ వేసేలోగానే పరువులు పోవచ్చు. కొంపలు కూలిపోవచ్చు, కులగిరులు తలకిందులై పోవచ్చు. ముష్టి పాతిక రూపాయలకోసం పరువులూ, కొంపలూ, కులగిరులూ పోయి, కూలిపోయి, తలకిందులైపోవడం సబబేనా. వాటివల్ల రైళ్ల రాకపోకలు దెబ్బతింటాయి. దానివల్ల మెడ్రాసులో, వైజాగులో, భానుమతులూ, సీతలూ, కాలేజీలకూ, హైస్కూళ్ళకి వెళ్లివచ్చేవేళ గుర్నాధాలు సందుమొగల్లో, బస్టాండు దగ్గరా బీటుకాయడం వీలుపడదు. దానివల్ల సరోజకళ్లలోకి లోతుగాచూసి బోల్డు ఫీలవుతూ

సిగరెట్లు కాల్చుకోడానికి (దానికీ అప్పు దొరకదు గదా) వీలుండదు. అలాగే అప్పుడు అప్పులిచ్చే వాళ్లివ్వలేరు, పుచ్చుకునేవాళ్లు పుచ్చుకోలేరు. చివరికి ఈ విధంగా దేశంలో ఆర్థిక వ్యవస్థ అంతా స్తంభించిపోతుంది. ఇదంతా దేనివల్లటా! గుర్నాధం ఒక మొహమాటస్థుడికి పాతిక సర్దడం కోసమని. ఒక్కడుగు- ఒక్కటంటే ఒక్కటే అడుగుస్మీ- ఆ ఒక్కడుగూ వెయ్యవలసి రాలేకపోవడంవల్ల. ఆ అడుగువేసి ఇంట్లో ఇనప్పెట్లోంచి డబ్బు తెచ్చేదాకా అప్పారావు కనక ఆ పాతికా గుర్నాధానికిస్తే- తన జేబులో వున్న పాతికా ఒక్క నిముషం సేపు గుర్నాధం అజమాయిషీ కింద అతని ఇలాకాలో ఉంచితే? - ఏమీలేదు- లోకం అంతా ప్రశాంతంగా ఉంటుంది. కోకిలలు కూస్తాయి, పువ్వులు పూస్తాయి. అప్పులడిగే వాళ్లు అడుగుతారు, ఇచ్చేవాళ్లిస్తారు. ఇవ్వని వాళ్లూ ఇస్తారు- సరిగ్గా అడిగితే. పరువులు యెక్కడికీపోవు. ఉన్నచోట తిష్టవేసుక్కూచుని, సత్యాగ్రహం చేసేవాళ్లలా ఛస్తే కదలం అంటాయి. కొంపలు కూలనే కూలవు, సరికదా కాలరెత్తుకు మరీ నిలబడతాయి, పొగరుగా. కులగిరులూ అంతే, అప్పారావుకి వెయ్యి రూ.లు అప్పిస్తానన్న గుర్నాధం ప్రతిజ్ఞలా చలనం లేకుండా అలా నిలబడతాయి. ఇదంతా దేనివల్ల? అప్పారావు జేబులో పాతిక రూపాయల్నీ పిలకట్టుకు ఇవతలికి లాగి,- ఇదుగో మిమ్మల్నే- వీరు గుర్నాధంగారు. ఒక ఐదు నిముషాలసేపు వీరి చేతుల్లోకెళ్లి వారు చెప్పినట్లు చెయ్యండి. ఎక్కడికి పొమ్మంటే అక్కడికి పొండి. తరవాత ఆయనే మళ్లీ పంపించేస్తాడు. నా దగ్గరకే వద్దురుగాని. బెంగెట్టుకోకండి. మరేం ఫర్వాలేదు, ధైర్యమే జయము, సత్యమే జయించును. ధర్మరాజు శాంతమూర్తి, నకులుడు, సహదేవుడు, అర్జునుడు, హో భీష్ముడు పొండి. అంటూ వాటికి నీతిచెప్పి గుర్నాధానికి ఒప్పగించటం వల్ల ఇంత లోకకల్యాణమూ ఫెళ్లుమంటూ జరుగుతుంది. కాదనడానికి మధ్యన అప్పారావు ఎవడు? బోడి అప్పారావు. అంచేత అప్పారావు సాహసించి, త్యాగంచేసి నిస్వార్థంగా ఆ డబ్బుని గుర్నాధానికిచ్చాడన్న మాట. ఏవిటిచ్చాడు? అప్పు. అప్పనగానేమి? మనచేతిలో పాతిక రూపాయల్ని కాసేపు గుర్నాధాన్ని పట్టుకోనివ్వడం! అంతే. రేపు గుర్నాధం పెట్లో వెయ్యిరూపాయల్ని వాళ్ల నాన్నతో చెప్పి- కాసేపు-మహ ఐతే ఓ రెణ్నెల్లు- డబ్బు చేతికందితే ఒకపూట చాలు- అప్పారావుని పట్టుకోనివ్వడం. అంతే, అప్పనగా ఇది. అప్పారావనగా నెవరు? దేశ సేవచేసి ఇందాకటి పరువూ, కొంపా, కులగిరులూ వగైరాలను కాపాడే మహదవకాశమ్ మారువేషంలో అప్పారావై వచ్చి గుర్నాధం యెదుట నిలబడింది. కదా!

హిందూ థింకర్స్ అన్నదదే. హిందూ ఫిలాసఫీ, హోల్ హిందూ థాట్, ఒక హిందూథాటే ఏమిటి హోల్ వరల్డు థాట్ అంతా కూడా గొంతు చించుకుని అన్ని భాషల్లోను ఘోష పెడుతున్నది ఇదే. అబ్బీ అప్పారావు! నిన్ను గనక అప్పడిగితే వాణ్ణే ఉద్ధరించడం అనుకోకు. అప్పిచ్చే ఛాన్సును, అవకాశాన్ని, అదృష్టాన్ని ఇంతమంది సామాన్య జనులలోనూ నీకే ఇవ్వాలని, నిన్నే ఎన్నికచేసి ఎడ్రసు కనుక్కుని వెతుక్కుని వచ్చినవాడు మహానీయుడేనని తెలుసుకో. వాడిని చూసి ఆనందపడి పొంగిపో. స్వామీ, తమకు అప్పు ఇచ్చే మహదవకాశాన్ని నాకు ప్రసాదిస్తున్నారు. నేను బహుయోగ్యుణ్ణే అనీ, నేను అప్పిచ్చి మళ్లీ యెన్నాళ్లకే

అడగననీ లోకం కోడై కూస్తోంది. కాన కటాక్షించి నాకు కొంచెం పెద్దకోటా ఇచ్చి అప్పు ఎక్కువ తీసుకోవలసిందని వేడుకుంటున్నాను అని ప్రాధేయపడి మరీ ఇవ్వాలి. అయితే గుర్నాథం అలా అన్నప్పటికీ అప్పారావు పుచ్చుకుంటాడా? కోడు. గుర్నాథం మీద ఎంత ప్రేమ, అభిమానం ఉన్నా అప్పారావుకు పక్షపాతం లేదు. నీ కోటా వెయ్యి రూ.లు. దాటనివ్వను. ఇంకోసారి చూదాం అని కరక్టుగా వెయ్యి రూ.లే. (చిల్లర ఖర్చుకి ఐదు రూపాయలు కాక) పుచ్చుకొని పొమ్మంటాడు. మళ్లా ఎప్పుడిస్తాడు? ఏమో గుర్నాథం ఇట్నించి నోట్లు లెక్క పెట్టి వంద, రెండొందలూ, మూడూ, నాలుగూ అంటూ ఉండగానే, మరోపక్కనించి అప్పారావు ఆ అప్పును తీర్చి పారేస్తూ ఉండవచ్చు. లేదా రావలసిన డబ్బు సకాలంలో రాకపోతే వారం పదిరోజుల్లో, నెలారెన్నెల్లో పట్టచ్చు. తరవాత ఆ డబ్బు తిరిగిచ్చి నాయనా దీన్ని యింకోడికి అప్పిచ్చి సద్వినియోగం చెయ్యాలని దీవించవచ్చు. అందువల్ల గుర్నాథం ఈ అపూర్వావకాశాన్ని చేజారవిడుచుకోక తప్పకుండా వాళ్ల నాన్ననడిగి వెయ్యా సర్దేస్తే రక్షించినవాడవుతాడు. అప్పారావు గుర్నాథం మేలు జన్మజన్మలకీ జ్ఞాపకం చేసుకుంటాడు; ఋణం ఈ జన్మకి తీర్చలేడు. చర్మం చెప్పులు కుట్టించడానికి అభ్యంతరం లేదు కాని బాగుండదు. జోళ్లు పల్చగా వస్తాయి. అంతకన్న గవర్నమెంటువాళ్ళు చేయిస్తున్న జోళ్లు చాలా మంచివి. మన్నును. చౌక కూడాను.

పోతే అప్పు సంగతి. గుర్నాథం కనక రేపు తెల్లారి యేడున్నరకి, రొక్కాం జతపరచకపోతే, అప్పారావు శివాలయం గుమ్మం దగ్గర్నుంచి సరాసరి పొరుగులోకం, ఏ కైలాసమో పోయి అక్కడ, అప్పు వెతుక్కోవలసి వస్తుంది. లేదా కోవెల అసింటా కూర్చున్న స్వామీ ఋణానందతో కలిసి ఋషీకేశం లేచిపోవలసి వస్తుంది. సన్యాసంకూడా ఆత్మహత్యే నన్నారు పెద్దలు మరి. కాబట్టి గుర్నాథం ఈ ముక్క మనసులో ఉంచుకుని మరీ వాళ్ల నాన్నని ఒప్పించడం మంచిది అని ఋణధీరుడు అప్పారావు క్రితంరోజు రాత్రి శివాలయం దగ్గర గుర్నాథానికి ఋణహృదయం విశదం చేశాడు.

ఆ ముక్క మనసులో ఉంచుకొని వో మూల తనకీ అనుమానం పీకుతున్నా తండ్రి ఎదటపడి నసుగుతూ నిలబడ్డాడు "గుర్నాథం మర్నాడు ఉదయం" అని సుబ్బన్న కథ ఆపి కడుపారా గాలి భోంచేసి బుస్సున తేన్చాడు.

ఇంతకీ యెవరీ అప్పారావు. ఆ పిల్లాడు వీడికి అప్పిచ్చేశాడా? అన్నాడు చీమల సింహాద్రి కుతూహలంతో.

"సరిగ్గా ఈ ప్రశ్నే మునసబుగారు అడిగారు.

అబ్బాయ్, యెవరోయ్ ఈ అప్పారావు? నీ కెలాటి స్నేహం యితనితో. ఇంత డబ్బు నమ్మి యివ్వవచ్చునా? నా యెదుట పడి అడగడేం అన్నారు.

అప్పారావు నాకు మెడ్రాసులో స్నేహం అయాడు నాన్నా అన్నాడు గుర్నాథం.

ఎంత స్నేహం అయితేమటుకు యిలా స్వగ్రామాల దాకా తరివి తరివి అప్పులడుగుతారుటోయ్–ఇదెక్కడి స్నేహం అన్నాడు మునసబుగారు ఆలోచించి.

గుర్నాథం మందహాసం చేశాడు.

* * *